నడికాలపుమనిషి!" అని — నిజంగా చెబితే నమ్ముతారో నమ్మరో — పెద్ద పెట్టున ఏడ్చింది.

గొల్లబోయడు నిర్విణ్ణుడై పోయినాడు. చాకలి మాలదాని తాటాకుగొడుగు అందిపుచ్చుకొని ఆ విప్రశవానికి శిరంవెంపు చాటుగా పట్టుకున్నాడు. వారసు అనే ఆతడు తనచేతిలోనికి ముసిల్ది కుండలోంచితీసి అంత దూరాన్నుంచి విసరుతూవుంటే గొడుగుచాటునే కూర్చుండి ఏరు పిడకలందిపుచ్చుకుంటూ పేర్చి దహనసంస్కారం గావించాడు.

కాష్ఠపు మంటను చూస్తూ ముసిల్ది "శ్రీ సూర్యనారాయణ మూర్తి కంటే తేజశ్శాలి నా తండ్రి!" అని అనుకొని తక్కిన వాళ్ళంతా వెళ్ళిపోయిందాకానిల్చి ఇంకా మిక్కిలి స్మరించిందిలా. "నా తండ్రి! నేనడగనేలేదు. నే నెత్తమనేలేదు. అలాజపం చేసుకొంటూవున్నా అయన, నా కష్టంకనిపెట్టి, అలా తనచెయ్యి నా కడవమీదఆంచి నిండుకుండ నెత్తికెత్తాడు. ఇప్పుడెవరెత్తుతారు? ఇప్పుడెవరెత్తుతారు? అని వానచినుకులో కన్నీళ్లో ఏర్పరుప రాకుండా పూరింపుగన్న తన పేదకుండను అక్కడే విడిచిపెట్టి మళ్ళీవస్తానంటూ సెలవుపుచ్చుకుంది.

.... .... .... .... ....

## ఋ జు వు భా ర ము

ఆండాళ్ళమ్మకు కళ్యాణి కూతురు. ఆమెకు సంతాన మా కూతురొక్కర్తుకే. ఆండాళ్ళమ్మ భర్తపేరు తిరువెంగళాచార్యులు. తిరువెంగళాచార్యులు పేరు మాని యాండాళ్ళమ్మ పేరెత్తు

కొనుటలో నందమేమీ యని పృచ్ఛింతురేమో? అండాళ్ళమ్మ లావణ్యమంతయు గల్యాణిలో ప్రతిబింబితము. అండాళ్ళమ్మ ముక్కే కళ్యాణి ముక్కు. కళ్యాణి ముక్కే యాండాళ్ళమ్మ ముక్కు. అండాళ్ళమ్మ కళ్ళే కళ్యాణి కళ్లు. కళ్యాణి కళ్ళే యాండాళ్ళమ్మ కళ్ళు. అండాళ్లమ్మ బుగ్గల మీది నిగారింపు కళ్యాణి బుగ్గలమీద వ్రాలినట్లుండు. అండాళ్ళమ్మ మప్టైలరవళిం బట్టి కళ్యాణియని, కళ్యాణి మప్టైలరవళింబట్టి యాండాళమ్మ యని యూరివారందఱనేక పర్యాయములు మోసపోయిన సుముహూర్తంబులు బెక్కులు గలవు.

కని పెంచిన తల్లికి గాపురమునకు వెడలని పిల్లకు నిసుమంతయేని వ్యత్యాస ముండవద్దా అన్న తొలుత నుండవచ్చు-ఉండవచ్చునేమి? ఉండక తప్పదు. తల్లి తల్లే. పిల్ల పిల్లే. కాని తల్లికిమఱి సంతానములేక, కలిగిన తొలుచూలే కడచూలై తల్లి యొక్క ముద్దుమురిపెంబుల కన్నింటికి బదియారేండ్లు పైదాటు వఱకు దాన కాణాచియై దినదినప్రవర్ధమాన యయిన కొండొక బాలామణి, తల్లి యంత యెత్తరియై తల్లితో సమముగ గొట్ట వచ్చు రూపంబున నున్నదన్న నాశ్చర్యమా? ఆశ్చర్యము లేదు. మఱియు మన యీ కథాంతర్వాహినిం బైకుబుకజేయు నాండాళ్ళమ్మ యందఱి తల్లులంబలె బుడుడువోసి కొన్నంత వఱడు చూపులు చూపవలెనను నియమము పాటించునట్టిది కాదు. సిగ, జడ, వ్రేలుముడి యెన్నిసార్లు మార్చిమార్చి వేసికొన్న నమ్మాడే. కాప్పొల్లదు. వగయే నగయన్నట్టు లవ్వగలాడి భర్తకడకుంబోయి మంగళసూత్రంబునుంగూడ నొత్తిగించి తన బొత్తాముల రైక కత్తిరిం పెట్టులున్నదని యడుగ వెఱువదు.

ఈ కడచేష్టకు గొంత కారణంబు తిరువెంగళాచార్యులుకూడ నైయుండు. అతడు కవి. కవిలోను బిల్హాణ, మల్హాణ, భాస కాళిదాసాది కృతరసప్లుత పుస్తకంబులం జదివినవాడు. "నీ ప్రతి క్షణ విజృంభణా దుభయబాహుమూలకూలంకషస్తన త్రుటిత కంచుకంబునం గత్తిరింపెట్టిదిగ నిర్వచింపగలాడ? నమతు యౌవనం, నమతు యౌవనం." అని మురిసిపోవువాడు. అండాళ్ళమ్మయు దోడ్తో దన డెంద ముప్పొంగ నాధునితో నిట్లను "నాయం దింకను మీకు లేజవ్వనంపు బసం దగపించు చున్నదా? నేను ముదుసలి బడుగునైపోతినని యనుకొనుచుండు నుడీ!" యని నిలువుటద్దంబు గట్టెదుటకుం జని తన నాధుని మనంబునందు సాక్షాత్కరించిన యౌవనదేవతను దద్దర్పణంబున దానును దన మ్రోల సాక్షాత్కరింప జేసికొనుచుండును. చేసికొని చేసికొని, హాస్యరసం బుట్టిపడ, నాధుని "ఆచార్యులవారూ!" అని పిలచి "అతివ కెంతవఱకు యౌవనంబు సుస్థిరమై యుండు నండీ!" అని దేవీదేవర సంవాదంబు నందలి విషమసందే హంబుభాతి నడుగు. తిరువెంగళుండును "పుత్రోదయ మగు వఱకు" నని తదభావంబునం జనించెడు కించిత్కాంచ బత్నికిం దోపనీని సదిప్రత్యుత్తరం బిచ్చుచుండు.

ఏవం విధ సుప్రోక్తానురక్తిప్రదీప్తి నెన్ని నిశలాదంప తులు వుచ్చియుండిరో వారి యేకపుత్రిక యగు కళ్యాణియొక్క వయస్సెప్పటికప్పుడు చాటునదియ—ఎవరెంత మాటుగనుంచ దలంచుకొన్నను:—

కళ్యాణికి కార్యమైన సంవత్సర మెదోకాని మాసము గార్తీకమాసము. కార్తీకమాస పౌర్ణమి కిటోయటో వాపరద్వాయ మెక్కువ తక్కువగ నత్తింటి కంపబడినది.

ఇక్కడిట నున్నవారు భార్యాభర్తలిరువురుమాత్రం. ఆండాళ్ళమ్మయు దిరువెంగళయ్యయును.

ఇక సంతు గలుగదను భీతి నొకనాడు మగడు సన్నిహిత మాణవుకు నొక్కని యథాశాస్త్రీయముగ దత్తతసేసికొను తలంపుతో దన మగువనుం బిలచి యామె యభిప్రాయం బడుగుచు నడుగుటలో నొడువుల నెంత స్వాతంత్ర్యంబునకు సావకాశ మిచ్చినను, చూపులమాత్రము "మీ యిష్టమే నా యిష్టము" అనుమా యన్నట్లు చూడ దొడంగెను.

భార్య భర్తవైపునకుం జూడకయ యతని పలుకులు వినుటలో మోము వంచుకొని తన కాలి బొటనవ్రేళ్ళను నా ప్రక్కనున్న చిటిపొటి వ్రేళ్ళనుం జూచికొనుచు "మనకు గలుగకున్న మన కళ్యాణికి గలుగకూడదా సుపుత్రు డొక్క రుండు. వాడు చాలడా మనము తరింప-" అని మిన్నకుండెను.

"పుత్రునియందు దండ్రియంశ ప్రకటితమ్ము. పుత్రుని ఛాయ వహించువాడు దత్తపుత్రుడు. అవశ్యము దత్తత సేసి కొందు" నన్నాడు భర్త.

"పుట్టిన పుత్రికయందు ముందుగ మీ యంశ చూపించి, పుట్టని పుత్రునకు మీయంశ యబ్బునన్న నమ్మగలను. అప్పుడు గదా వానిఛాయ వాడు వీడన్న వాడన్న" అని మెటికలు విఱిచి వనిత వెఁతలిపో నుంకించెను. ఉంకించు నాపె నాచార్య వర్యుం డట్టె చెఱగు వట్టుకొని చెఱగు మెలివెట్టుచు "ఇటు చూచి చెప్పుమఁటి. మన కళ్యాణి యెవనికి బుట్టిన చిన్నదని నీ యూహ! నాకు గల యీ యాస్తినంతను దానికి వ్రాసి యిచ్చిన నాయంశ దాని కబ్బెనని వచింతువా! యేమి? పలుగూ!" అని కొమ్మకణతలు రిమ్మదిరుగ దూలనాడెను.

ఆ మగనాలియు నొకింత యోపి యిట్లనె. "ఆత్మవత్స ర్వభూతాని" యను సాధువాక్యము ననుకరించి సర్వప్రాణులు నావంటివని నేననుకొందు నట్టిచో నాయెంట బుట్టినబిడ్డ నావంటిది గాని మీవంటి దొక్కనాటికిని గాదన్న దప్పే? ఎవ్వరితోనైన జెప్పి చూడుడు. లేదా నన్ను జీల్చివేయుడు" అని భర్త పాదములంబడి దాసురాల ననియెను. "కళ్యాణి నీ కెట్టిదో నాకుమ నట్టిదే. లేలెమ్మ" అని భార్య నప్పటికి లేవనెత్తి యింటిపనులు నిర్వర్తింప ననిపి తిరువెంగళండు వీధి యరుగుపై నిలిచెను.

"ఋజుపుభారము నాపై మోపినదే ఏమి గత్యంతరంబు" అని యొక కొనమండి వేఱొక కొనవఱకు వీధి నడచువారి నందఱ మాఱు కరయుచు "యఃపశ్యతి నపశ్యతి" అనుగీతా వాక్యమొండు గొణుగుకొనుచుండ నల్లమారనుండి యొక్క దొక్క చేయుత్తరంబునం గొనివచ్చి "కళ్యాణాంబగారు" వ్రాసి యిచ్చిరని యందిచ్చెను. అది విప్పిచూచునంత నందొక పద్దె మాపెచే నిట్లు లిఖింపబడి యుండెను.

తే. గీ. అమ్మకయ్యకు వందన మత్తవారి
　　యింట నే సుఖంబుంటి మీరెల్ల సుఖులె?
　　ఉందు నిల్లటికమనుచు నువ్విళూరు
　　నల్లు నెప్పుడు తీసుక వెళ్లువారు?

పద్దెమునందలి భావమున కంత యుబ్బెనో లేదో తిరు వెంగళండు. పద్దెము అని తెలిపెడు తే. గీ. లకడ వ్రేలుపెట్టి భార్య "నోసేవ్! ఒసేవ్! మనమ్మాయికి గవిత్వము పట్టు వడ్డది చూడు చూడు. తేటగీత వ్రాసిన దెంత బాగున్నదో" అని అనెను. "ఆశ్చర్యమేముంది? మీ కూతురు గాదాయేమి?

మీ కబ్బినట్లే కబ్బము దానికి వచ్చినది. ఏమని వ్రాసినది ?" అని వెనుదటిమినది జాబు నందిపుచ్చుకొనుటకై. జాబు నీయ కయే తిరువెంగళుండు "నాపై నీవు వైచిన ఋజువుభారము తీర్చివేసితినా లేదా యిప్పటికైన దీర్చివేసితినా లేదా ?" అని అడిగినాడు. ఆ ముక్కవినిపించుకొనకయ, ఉత్తరము చూడకయ యాండాళ్ళమ్మన్నది "మఱైన నెప్పుడు తీసికొనివత్తు రల్లి నిల్లటికము ?" అని అడిగినది. "ఔరా ! నీవటవే యా యుత్తరము వ్రాయించినది" అని ఆశ్చర్యపోయినాడు తిరువెంగళుండు. ఆండాళ్ళమ్మ చిరునవ్వు నవ్వుచూ "మాటలు నావీ కవిత్వము మీది" అంది.

ఆ చిరునవ్వు ఫలశ్రుతి యెంతవఱకు వ్రాసిన వ్రాయ వచ్చు గ్రంథవిస్తరభీతి విడిచినచో—తిరువెంగళాచార్యులకు దత్తత వ్యామోహము నశించినది. అల్లుడిల్లటికము వచ్చినాడు. కళ్యాణియే వానికి గొడుకునుం గూతుకయునై కష్టసుఖంబుల దలలో నాలుకవలె మెలంగినది. అనతికాలములో బుత్రు నెత్తి కొని కళ్యాణీ "యిడుగో ! పుత్రికా పుత్రుడు" అని తన తండ్రి తొడలం గూరుచుండబెట్టి వానికి బుత్రుడు లేని లోపము దీర్చినది.

.... .... .... .... ....

## వన్నెలాంగి - సన్నుతాడి

హిందూ సంఘమునం దొక తెగ మనుష్యులకు ఊరిలో నిలువ నీడ యుండదు. ఊరి వెలుపలనే వారి గూడెమూ వారి గోష్ఠి. కాని తెల్లవాఱి లేచి చూచునంత నూరునంతను బరిశ్రమ